క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని పలు కూడళ్లలో నివసిస్తున్న అనాథలు, యాచకులు, దివ్యాంగులకు శ్రీ సత్య ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ భవనాశి సత్యనారాయణ శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. తాను నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆయన దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలు కల్పించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పించాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఇంతవరకు దానికి సంబంధించి ఊసే లేదన్నారు. ప్రభుత్వం హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు గంధం సునీల్ కుమార్, ఆది, శివ ప్రసాద్, సూర్య వంశీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ సెల్ నూతన కమిటీ ఏర్పాటు



నియామక పత్రాన్ని అందచేస్తున్న వైవీయూ వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ నూతన కమిటీ సభ్యులను నియమించారు. నియామకపు పత్రాన్ని ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి , కులసచివులు ఆచార్య పుత్తాపద్మ నూతన కమిటీకి అందజేశారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ జి. విజయ భారతి (వాణిజ్య విభాగం, వైవీయూ, కడప) సభ్యులుగా డా కె. లలిత, (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ), డాక్టర్ బి. రెడ్డయ్య, (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, టెక్నాలజీ), డాక్టర్ జి. నాగేశ్వర రెడ్డి (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈఈఈ, వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొద్దుటూరు), డా. ఎస్. గణేష్ నాయక్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్)కు నియామకపు పత్రాలు అందజేశారు. ఇది వరకు ఈ స్థానంలో పనిచేసిన వారి పదవీకాలం పూర్తికావడంతో వైస్ ఛాన్సలర్ ఉత్తర్వుల మేరకు నూతన నియామకం చేశామని రిజిస్ట్రార్ పద్మ తెలిపారు.


కేంద్ర బడ్జెట్‌లో 'సీమ'కు అన్యాయం

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతాలకు తీరని అన్యాయం జరిగిందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవిశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. యువజన చట్టం ప్రకారం కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీ, పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు తదితర అంశాలను కేంద్ర బడ్జెట్ పూర్తిగా విస్మరించిందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పోలవరం, అమరావతికి నిధులిస్తే చాలంటూ వ్యవహరించడం దారుణమని దుయ్యబట్టారు. బీజేపీకి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం గొంతెత్తే నాధుడే లేక పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు.

నిధులు కేటాయించండి

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ప్రకటించిన ఎన్నికల హామీలకు సంబంధించిన నిధులను వచ్చే బడ్జెట్‌లో కేటాయించాలని ఎస్టీయూ కడప జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప ఎస్టీయూ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి పెద్దలు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను ప్రకటించాయన్నారు. అయితే నిధులను మాత్రం కేటాయించడం లేదన్నారు.

అంత్యక్రియలు



కడప అర్బన్: కడప నగర శివార్లలోని ఇందిరానగర్ సమీపంలో పద్మావతి వృద్ధాశ్రమంలో ఉంటున్న గుర్తు తెలియని వృద్ధురాలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. వృద్ధాశ్రమం నిర్వాహకులు రాంబాబు విజ్ఞప్తి మేరకు మేము సైతం సేవాసంస్థ ప్రతినిధి అయ్యవారయ్య ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు షామియానా సురేష్, రామరాజు, నరసింహ, నాగేశ్వరరావు, పుల్లయ్య తదితరులు ఆ వృద్ధురాలికి అంత్యక్రియలు చేశారు.

ఉర్దూ మీడియంలో తరగతులు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి బోధించే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు అందించే శిక్షణా తరగతులు ఉర్దూ మీడియం లో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షంషుద్దీన్‌ను రూట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, జుబేర్ అహ్మద్ కోరారు. ఈ విషయమై శనివారం డీఈఓ ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించి సమస్యను వివరించారు.

శాస్త్రీయ దృక్పథంతోనే మెరుగైన సమాజం

కడప ఎడ్యుకేషన్: శాస్త్రీయ దృక్పథంతోనే మెరుగైన సమాజం సాధ్యమని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు, వైద్యుడు డా వి. బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం యూనిట్ -9 ఆధ్వర్యంలో శనివారం శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవడంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ సమాజంలోని



సమావేశంలో మాట్లాడుతున్న డా వి. బ్రహ్మారెడ్డి

మూఢ నమ్మకాలను తొలగించి విద్యార్థులను విజ్ఞానం వైపు మరల్చడమే ఈ వేదిక ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. కె.క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఎలా మెలగాలి అనే అంశాలను ఈ సదస్సు ద్వారా విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదిక ప్రదర్శించిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కులసచివులు ప్రొ.పి. పద్మ , జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్-9 డా. కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరాన్ని బాల కార్మిక, భిక్షాటన రహిత నగరంగా తీర్చిదిద్దాలని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర పిలుపునిచ్చారు. శనివారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయ సమావేశ భవనంలో పోలీసు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కార్మికశాఖ, విద్యాశాఖ అధికారులతో అడిషనల్ కమిషనర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడెక్కడ బాల కార్మికులు ఉన్నారో, ఏ కారణాలచేత వారు బాల కార్మికులుగా పనిచేస్తున్నారో సర్వే నిర్వహించాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖల సమన్వయం అవసరమన్నారు. ప్రతి వారం ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసుకుని ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుభాష్ యాదవ్, ఇన్‌స్పెక్టర్ ఈదుర్‌బాషా, కార్మికశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి, సాంబశివరావు, యాగప్ప, శివారెడ్డి, బాలల పరిరక్షణ విభాగం, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర

యూనియన్ ఏర్పాటు

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ లో నూతనంగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ స్టాఫ్ యూనియన్ ఏర్పాటయింది. శనివారం సాయంత్రం దేవుని కడపలోని కాలవ ఫంక్షన్ హాల్ లో యూనియన్ నాయకులంతా సమావేశమై భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు. ఓఅండ్ ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. దీనికోసం పది మందితో అడ్ హాక్ కమిటీని ఎన్నుకున్నారు.



ఏపీ ఎస్పీడీసీఎల్‌లో ఓఅండ్‌ఎం స్టాఫ్ నూతన కార్యవర్గం

పరిశోధనలపై ఆసక్తి చూపాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు ప్రారంభ దశ నుంచే పరిశోధన పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ రమేష్ పేర్కొన్నారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో మొదటి సంవత్సరం జంతు శాస్త్రం అభ్యసిస్తున్న విద్యార్థులు జాతీయ స్థాయి సదస్సులో డిపిటి స్టార్ట్ స్కీమ్ లో భాగంగా పత్ర సమర్పణ చేసి ప్రతిభ చాటారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జంతుశాస్త్రం, ఆక్వా కల్చర్ శాఖ సంయుక్తంగా గత నెల 29, 30 న నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో జంతు శాస్త్ర విద్యార్థులు పత్ర సమర్పణ చేశారు. ఇందులో పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో బి సాయి, యాంటీ డయాబెటిక్ పొటెన్షియల్ ఆఫ్ జింజర్ అఫీషియల్ ఏ సస్టైనబుల్ అప్రోచెస్ టు డయాబెటిస్ మిటిగేషన్ అనే అంశంలో ఎస్ హుసేన్ ద్వితీయ బహుమతి పొందారు. అలాగే ఓరల్ ప్రజెంటేషన్ విభాగంలో కె సాయి లీల, మని నిహంత్, అంజి నాయక్ మానవ ఆధునీకరణ యుగంలో సమగ్ర అభివృద్ధిని సాధించడంలో జీవవైవిధ్యం




విద్యార్థికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న అధ్యాపకులు

ప్రాముఖ్యత అనే అంశంలో తృతీయ బహుమతిని సాధించారు. జాతీయస్థాయిలో విద్యార్థులు రాణించటం పట్ల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేష్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.రవిశేఖర్, గైడ్ గా వ్యవహరించిన డాక్టర్ వై సావిత్రి, జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ డివి నాగేంద్ర కుమార్, మహేష్ , డాక్టర్ అపర్ణ, ఇతర అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 2024 మే మాసంలో విధులు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే డ్యూటీ సర్టిఫికెట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. ఈ విషయమై శనివారం కడప కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ ఎం.విశ్వేశ్వర నాయుడును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 మే మాసంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల విధులు నిర్వహించారన్నారు. ఎన్నికలు మే మాసంలో జరిగినందున వేసవి సెలవులను నష్టపోయినందుకు గాను ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్జిత సెలవులను మంజూరు చేసిందని తెలిపారు. ఈ సెలవులను సర్వీసు రిజిస్టర్‌లో నమోదు చేయాలంటే ఎన్నికల విధులు నిర్వహించిన కాలానికి అధికారులు డ్యూటీ సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ అయిపోయిన వెంటనే ఉద్యోగులకు డ్యూటీ సర్టిఫికెట్ జారీ చేశారని, కమలాపురం నియోజకవర్గంతో పాటు మరి కొన్ని ప్రాంతాలలో డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. దీంతోపాటు జిల్లా వ్యాప్తంగా రిజర్వులో విధులు నిర్వహించిన పలువురు ఉపాధ్యాయులకు అధికారులు డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వకపోవడం వల్ల ఆర్జిత సెలవులను పొందేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి డ్యూటీ సర్టిఫికెట్ తక్షణమే ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్: మత్తు పదార్థాలకు నో చెబుదాం , బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందామని ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి అన్నారు. కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో శనివారం యాంటి డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు యువత మాదక ద్రవ్యాల వల్ల మైండ్‌తో పాటు, విచక్షణా శక్తిని కోల్పోతున్నారని, సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతూ సమాజం నుండి దూరమవుతున్నారన్నారు. ప్రాణాంతకమైన మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ అరికట్టండి



రిమ్స్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా పైపులైన్ లీకేజీ



రామాంజనేయపురం వరదకాలనీలో..

కడప కార్పొరేషన్: కడప నగరం రామాంజనేయపురం పరిధిలో పలుచోట్ల పైపులైన్లకు లీకేజీలు ఏర్పడ్డాయి. చాలా రోజులుగా వీటి నుంచి తాగు నీరు వృథాగా ప్రవహిస్తున్నా నగరపాలక అధికారులు పట్టించుకోలేదు. తిరుపతి రోడ్డులో బైపాస్ వద్ద రిమ్స్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా పైపులైన్ లీకేజీ ఏర్పడి నీరు వృథాగా ఖాళీ జాగాలోకి ప్రవహిస్తున్నాయి. అలాగే వరదకాలనీ సెంటర్‌లో మసీదు పక్కన తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడింది. వీటి వల్ల తాగునీరు అధిక మొత్తంలో వృథాగా ప్రవహిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

10,11 తేదీల్లో లూర్దుమాత తిరునాల

కడప కల్చరల్ : నగరంలోని మరియాపురంలో వెలసిన లూర్దుమాత తిరునాల మహోత్సవాలు ఈ నెల 10, 11 తేదీల్లో వైభవంగా నిర్వహిస్తున్నట్లు విచారణ గురువు ఈరి మరియన్న తెలిపారు. శనివారం ఆయన స్థానిక పాత చర్చి వద్ద ఉన్న లూర్దుమాత స్వరూపం వద్ద ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహోత్సవాలు కడప మేత్రాసన బిషప్ డాక్టర్ గాలి బాలి ఆధ్వర్యంలో జరుగుతాయని అన్నారు. మరియాపురం గ్రామాన్ని 1934 సంవత్సరంలో ఫాదర్ క్రంబ్లిస్ నిర్మించి ఇక్కడ దేవుని సేవ కోసం చిన్న గృహం ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10,11 తేదీల్లో ఆనవాయితీగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు రాయలసీమ ప్రాంతం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల వారు వచ్చి దేవ మాతను దర్శించుకుంటారన్నారు. 10 వ తేదీ రాత్రి డాన్ బోస్కో ఐటిఐ నుంచి నగరంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు జరిపి, లూర్దుమాత స్వరూపం స్థానిక మారియా పురం గుడి వద్దకు చేరుతుందని చెప్పారు. 11 వ తేదీన భజనలు, కోలాటంతో పాటు రాత్రి సాంఘిక నాటకం లాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో విచారణ సహాయ గురువు సుధాకర్, తిరునాల కమిటీ ప్రెసిడెంట్ జె రాయప్ప, వైస్ ప్రెసిడెంట్ బి బాల శౌరి, సెక్రటరీ ప్రదీప్, జాయింట్ సెక్రటరీ యన్నం ఆనంద్, ట్రెజరర్ కల్లూరి ప్రసాద్, ఎండీ అల్ఫోన్స్, వారాధి జోసెఫ్, అల్లూరి జోజప్ప , దేవరాజు, వై జయపాల్, శేఖర్ , బాలయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విచారణ గురువు ఈరి మరియన్న తదితరులు

కమ్మ సామాజికవర్గ అభ్యున్నతికి కృషి



కమ్మ సామాజిక వర్గ నాయకులతో నూతన కార్యవర్గం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కమ్మ సామాజిక వర్గ అభ్యున్నతికి కృషి చేస్తానని ఆ సంఘం అధ్యక్షులు పల్లినేని నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు దొడ్డపనేని చంద్ర శేఖర్ నాయుడు తెలిపారు. శనివారం సంస్థ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో, వివిధ వృత్తులలో ఉన్న కమ్మ సామాజిక వర్గాన్ని ఐక్య పరచడం, సంఘటితం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ వేలూరి రవిచంద్ర, ట్రెజరర్ ఇప్పర్ల పూర్ణ చంద్రరావు, సభ్యులు, శివశంకర్, పవన్‌కుమార్, గుత్తా ప్రసాద్‌నాయుడు, నాగేంద్ర, సుబ్బరాయుడు, శివశంకర్, సుధాకర్‌నాయుడు, చిన్న వెంకట సుబ్బయ్య, మదన్‌మోహన్, హనుమంతు, కామినేని ప్రవీణ్, రామసుకుమార్, దామచర్ల శ్రావణ్, భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

7,8న క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 7, 8వ తేదీలలో యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలలకు సంబంధించి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైవీయూ అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్, సాఫ్ట్ బాల్ పురుషులు, మహిళల , బాల్ బ్యాడ్మింటన్ పురుషుల క్రీడా పోటీలు వైవీయూ అనుబంధ కళాశాల అయిన కమలాపురంలోని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొనువారు 1 -7 -2024 తేదీకి 17 సంవత్సరాలు పైన 25 సంవత్సరాల లోపు వయసు కలిగి విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో చదువుతూ ఉండాలన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు స్టడీ, టెన్త్ మార్కుల మెమో, ఇంటర్మీడియట్ మార్కుల మెమో, సెమిస్టర్ మార్క్ మోమో ఒరిజినల్ , జిరాక్స్ పత్రాలు తీసుకొని 7వ తేదీ ఉదయం 8 గంటలలోపు సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు 93814 54069 సెల్ నంబరును సంప్రదించాలని సూచించారు.

తపాలా జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రజలు తపాలా జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని కడప డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని కడప డివిజన్ తపాలా శాఖ ప్రధాన కార్యాలయంలో తపాలా జీవిత బీమా 141 వసంతాలు పూర్తి చేసుకొని 142 వ వసంతంలోకి అడుగెడుతున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ పీఎల్ఐ రోజురోజుకు ప్రాచుర్యం పొందుతూ ప్రజలలో దగ్గర అవుతూ ఎక్కువ కస్టమర్లను సొంతం చేసుకుంటూ ముందుకు పోతోందన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు ఏ. విజయభాస్కర్, ఎం. విజయభాస్కర్ రెడ్డి , ప్రధాన తపాలా కార్యాలయ పోస్టుమాస్టర్ ఒ. సుబ్బరాయుడు, పి.ఎల్.ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కడప డివిజన్ తపాలాశాఖ సూపరింటెండెంట్ రాజేష్

డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా మురళీమోహన్

కడప ఎడ్యుకేషన్: కడప డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా మురళీ మోహన్ నియమితులయ్యారు. ఈయన కడపలోని సమగ్రశిక్ష కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ శనివారం బదిలీపై డీఈఓ కార్యాలయానికి వచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు డీఈఓ కార్యాలయ నాన్‌టీచింగ్ నాయకులు రమేష్‌బాబు, సాయి, నిఖిలేష్‌లు శుభాకాంక్షలు తెలియచేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్: కడప నగరంలోని ఫాతిమా వైద్యకళాశాలలోని హాస్టల్‌లో వంట పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎం.డి మన్సూర్‌ఖాన్ (43) అనే వ్యక్తి అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో తాను వుంటున్న గదిలోనే చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే కళాశాలలో అతని భార్య ఫరియా వార్డెన్‌గా పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు వున్నారు. వీరు రెండేళ్ల క్రితం కాకినాడ నుంచి వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారు. మన్సూర్‌ఖాన్ భార్య ఫరియాకు శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఫోన్ చేసి కుమారుడిని బాగా చూసుకోవాలని ఆవేదనతో అన్నాడు. దీంతో అనుమానం వచ్చిన ఆమె అతడి గది దగ్గరికి వచ్చింది. పిలిచినా ఎంతసేపటికీ తలుపు తెరవకపోవడంతో కిటికీలో నుంచి ఆమె చూసింది. ఫ్యాన్‌కు వేలాడుతుండటంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపు గడియను పగులగొట్టి కిందకు దించారు. సీపీఆర్ చేశారు. కానీ అప్పటికే మృతి చెందాడు. శనివారం సాయంత్రం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

ప్రాజెక్టులను పూర్తి చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని అఖిల పక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఈనెల 9వ తేదీ విజయవాడలో జరుగు రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సీఆర్పీ ప్రసాద్ అధ్యక్షతన శనివారం నగరంలోని పార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. అఖిలపక్ష కమిటీ నాయకులు నారాయణ, సీఆర్పీ ప్రసాద్ ,సత్తార్, గుర్రప్ప మాట్లాడుతూ మొదట పెండింగ్ లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రాయలసీమలో ప్రాజెక్టులు ఎన్నో సంవత్సరాల నుంచి పూర్తికాక వెనుకబాటు తనానికి గురవుతూ వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు అంజి, రవిశంకర్ రెడ్డి, జయవర్ధన్, సుబ్బరాయుడు, ప్రభాకర్ రెడ్డి , సగిలి రాజేంద్ర ప్రసాద్ , డీఎం ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య బహిరంగ ప్రకటన మరియు యావన్మంది ప్రజానీకానికి బహిరంగ నోటీసు

మా కక్షి కర్త అయిన వై.యస్.ఆర్. కడప జిల్లా, సింహాద్రిపురం మండలం, హిమకుంట్ల గ్రామం మరియు పోస్టులో కాపురం ఉండే చవ్వా చిన్న కొండారెడ్డి గారి కుమారుడు తిమ్మారెడ్డి వెంకట నారాయణ రెడ్డి గారి తరపున బహిరంగ పరచడము ఏమనగా

షెడ్యూలు దాఖలా ఆస్తి ఇదివరలో కడప జిల్లా,పులివెందుల మండలం, టౌన్ మరియు పోస్టు డోర్ నెం: 4-9-100 నెంబరు గల వై.యస్.వి.యం. బాలికల కాలేజి వెనుక భాగమున కాపురం ఉండు కర్ష రామాంజులు రెడ్డి గారి కుమారుడు కర్ష విజయవర్ధన రెడ్డి గారికి సంపూర్ణ హక్కులతో రిజిష్టరు పత్రముల ద్వారా బాధ్యపడి అతని ప్రత్యేక స్వాధీన అనుభవంలో ఉంటూ ఉన్నది. ఇందులో పై తెలిపిన కర్ష విజయవర్ధన రెడ్డికి తప్ప ఇతరులేవ్వరికి ఏ విధమైన హక్కు, అనుభవం బాధ్యత వగైరాల ఎంతమాత్రము లేదు. అట్లు ఇతరాదులు కోరుటకు బలమైన కారణం సహాలేవు. ఇట్లుండగా పై తెలిపిన కర్ష విజయవర్ధన రెడ్డి మా కక్షి పేరున షెడ్యూలు ఆస్తిని గురించి 06-09-2012వ తేదిన ఖరారు చేసుకున్న ఒప్పందం రీత్యానునూ, మరియు విక్రయ అగ్రిమెంటు రీత్యానునూ మా కక్షి కర్తకు 4,00,000/-లు రూపాయలకు విక్రయ అగ్రిమెంటు పైకమునకు ఏర్పాటు చేసుకొని అందులో 06-09-2012వ తేదిన 3,85,000/-లు పైకం నగదుగా తీసుకొని మిగిలిన పైకం అనగా 15,000/- రూపాయలు మా కక్షి కర్త ఎప్పుడు కోరినంతట అప్పుడు అనగా కాల నిర్ణయము ఎంత మాత్రము లేకుండా మనఃపూర్వకముగా ఒప్పి సదరు తేదిన నిజమైన, న్యాయమైన సంగతులతో గుర్తెరిగి విక్రయ అగ్రిమెంటును నా కక్షి కర్తపేర చట్ట పరిధిలో వ్రాయించి ఇచ్చి ఉన్నాడు. సదరు విక్రయ అగ్రిమెంటు ప్రకారం మా కక్షి కర్త ఎల్లవేళలా నడుచుకొనుటకు సంసిద్ధముగా ఉంటూ ఉండినారు. మా కక్షి కర్తను 06-09-2012వ తేదిన గల విక్రయ అగ్రిమెంటు లోని కండిషన్ అనుసరించి షెడ్యూలు ఆస్తిని Sec 53-A of TP Act ప్రకారం Part Performance స్వాధీనం ఇచ్చి ఉన్నారు. పై విషయములు మరియు 06-09-2012వ తేదిన గల విక్రయ అగ్రిమెంటులోని ఇతర విషయములు యావన్మంది ప్రజానీకమునకు ఎప్పటికప్పుడు బాగుగా తెలియును. కానీ పై తెలిపిన కర్ష విజయవర్ధన రెడ్డి పైన తెలిపిన విక్రయ అగ్రిమెంటు విషయములకు భిన్నముగా నడుచుకొనుటకు ప్రయత్నించగా మా కక్షి కర్త 07-07-2015వ తేదిన వకీలు గారి ద్వారా దావా నోటీసును నిజమైన సంగతులతో పంపి ఉండగా సదరు నోటీసును తీసుకొని ఏ విధమైన జవాబు ఇవ్వక వృధా కాలయాపన చేయసాగాడు. అటు తరువాత మా కక్షి కర్తకు తెలియడంతో సదరు కర్ష విజయవర్ధన రెడ్డి మా కక్షి కర్త యొక్క విక్రయ అగ్రిమెంటు హక్కు భుక్తములను ముంచవలయుననే దురుద్దేశ్యముతో ప్రయత్నించి షెడ్యూలు ఆస్తిని 06-09-2012వ తేది గల విక్రయ అగ్రిమెంటు అమలులో ఉండగానే పులివెందుల (టౌన్), సి.వి. సుధాకర్ రెడ్డి కాలనీ, డోర్ నెం:4-8-169-1 నెంబరులో కాపురం ఉండు అజ్జుగొట్టు రంగారెడ్డి కుమారుడు అజ్జుగొట్టు రఘునాథరెడ్డి పేరున 18-05-2015వ తేదిన తప్పుడు విషయములు తప్పుడు సంగతులతో ఊహాజనితమైన విషయములతో కల్పించుకొని Document No. 1438/2015 of S.R.O పులివెందుల వారి ఆఫీసులో వ్రాసి ఇచ్చినట్లు తెలిసినది. పిమ్మట మా కక్షి కర్త O.S.No.332/2015 అను అగ్రిమెంటు దావాను (1) కర్ష విజయవర్ధన రెడ్డి మరియు (2) అజ్జుగొట్టు రఘునాథ రెడ్డి గారి పైన 30-07-2015వ తేదిన శ్రీ కడప Principal Senior Civil judge Court వారి కోర్టులో 06-09-2012వ తేది నాటి అగ్రిమెంటు ననుసరించి కోర్టు ద్వారా రిజిష్టారు పత్రమును చట్టపరిధిలో పొందుటకు మరియు పై కనపరచిన ఎ.రఘునాథరెడ్డి పేరున గల 18-05-2015వ తేది గల రిజిష్టరు విక్రయ దస్తావేజు రద్దు పరచుటకు కలిపి దావా దాఖలు చేయగా సదరు దావాలో ఉభయ ప్రతివాదులు Ex-Parte కాబడి నందు వలన పై కోర్టు వారు వాది అయిన మా కక్షి కర్త పేర 31-03-2021వ తేదిన అతను కోరిన పరిహారమునకు డిక్రీ ఇచ్చి వున్నారు. సదరు డిక్రీ చట్టపరిధిలో వెంటనే అమలులోనికి రాబడి ఈ రోజు నరికి వాది ప్రతివాదులను బైండు చేయుచున్నది. పై తెలిపిన 31-03-2021వ తేదిగల డిక్రీననుసరించి మా కక్షి కర్త E.P.No.63/2021 మనవి దాఖలు చేసిన కోర్టు ద్వారా శుద్ధ రిజిస్ట్రారు విక్రయ దస్తావేజు నెం 1750/2023 of S.R.O పులివెందుల కార్యాలయం ద్వారా పొంది షెడ్యూలు ఆస్తికి సంపూర్ణ హక్కు దారుడై ఈ రోజు నరికి అనుభవంలో ఉన్నాడు. పై విషయాలను బలపరుచుటకు మా కక్షి కర్తకు అయిన సంపూర్ణ రికార్డులు సహా ఉన్నది.

ఇటీవల కాలంలో తెలియడంలో O.S.No.332/2015 (Principal Senior Civil Judge Kadapa) దావా డిక్రీకి భిన్నముగా మరియు వ్యతిరేఖంగా మరియు ఏదో ఒక విధముగా బంగపరచునట్లు అందులో గల 2వ ప్రతివాది ఎ.రఘునాథరెడ్డి మా కక్షికర్త పరోక్షంలో మరియు అతని పేరు గల 06-09-2012వ తేది నాటి విక్రయ అగ్రిమెంటును ఉద్దేశ్యపూర్వంగా మరుగుపరిచి షెడ్యూలు దాఖలా ఆస్తిగా 20-05-2015వ తేది గల విక్రయ అగ్రిమెంటును ఇరికిరెడ్డి కృష్ణారెడ్డి గారి కుమారుడు ఇరికిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి (పులివెందుల టౌన్ వాస్తవ్యులు) పేర తప్పు సంగతులు సృష్టించి అటు పై O.S.No.130/2015 దావాను శ్రీ పులివెందుల Junior Civil Judge వారి కోర్టు ద్వారా విక్రయ అగ్రిమెంటు పొందుటకు ఎ.రఘునాథరెడ్డి గారి పేరు పైన మాత్రం దావా దాఖలు చేసి 29-07-2015 తేది గల వాది, ప్రతివాదులు కుమ్మక్కై O.S.No.130/2015 దావాలో Ex-Parte డిక్రీని పొంది వున్నారు.సదరు O.S.No.130/2015 దావాలోని డిక్రీ O.S.No.332/2015 (Principal Senior Civil Judge Kadapa) డిక్రీ సమక్షంలో ఎంత మాత్రము నిజమైనది, న్యాయమైనది, చెల్లుబాటు తగినది కాదు మరియు O.S.No.130/2015 దావాలోని ప్రతివాది ఎ.రఘునాథ్ రెడ్డికి షెడ్యూలు ఆస్తిపైన O.S.No.332/2015 డిక్రీ ప్రకారం ఏ విధమైన హక్కు, అనుభవం వగైరాలు ఎంత మాత్రము సంక్రమించి ఉండలేదు. మరియు ఎ.రఘునాథ్‌రెడ్డి పేర గల విక్రయ దస్తావేజు కోర్టు డిక్రీ 31-03-2021వ తేది ప్రకారం రద్దు కాబడి ఉన్నది. పై విషయాలన్నియు యావన్మందికి బహిర్గతముగా తెలియును. మా కక్షి కర్త పరోక్షములో O.S.No.130/2015 కుమ్మక్కై 29-07-2015వ తేదిన పొందియుండిన డిక్రీని E.P.No.64/2015 మనవి ద్వారా దాక్యుమెంటు నెం 4094/2015 Sub-Register Office పులివెందుల ఆఫీసు వారి ద్వారా పొందినట్లు పత్రములు సృష్టించి వున్నారు. ఇంతటితో ఆగక పునః సదరు ఇరికిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి 04-01-2025వ తేదిన షెడ్యూలు ఆస్తిని అతని భార్య పేరున మీద సెటిల్‌మెంటు దస్తావేజు నెం.54/2025 Sub-Register Office పులివెందుల వారి ఆఫీసులో దురుద్దేశ్యపూర్వకంగా తప్పుడు సంగతులతో సృష్టించి ఉన్నారు.సదరు యావత్తు చర్యలు O.S.No.332/2015 దావాలో మా కక్షి కర్తను ఎంత మాత్రము బైండ్ చేయవనిన్నీ మరియు చట్ట పరిధిలో మా కక్షి కర్తకు సంక్రమించిన హక్కులు, అనుభవం, బాధ్యతల సహా ఏ విధంగా కూడా భంగపాటు కలుగదనిన్నీ మరియు మా కక్షి కర్త సంపూర్ణ హక్కు దారుగా షెడ్యూలు ఆస్తిని అనుభవించుటకు హక్కుదారుడై ఉంటున్నాడని తెలిపి మరియు బహిరంగ పరచుచూ ఈ ప్రకటన ఇవ్వడమైనది. పై విషయాలకు భిన్నముగా గల యావత్తు రికార్డులు, చర్యలు కుమ్మక్కై జరిపిన యావత్తు కోర్టు వ్యవహారములు NULL and VOID ఉంటూ ఉన్నవనిన్నీ మరియు మా కక్షి కర్తను ఏ విధముగా కూడా బైండ్ చేయజాలవని, నికరముగా నిక్కచ్చిగా బహిరంగ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

షెడ్యూలు

కడప జిల్లా, ప్రొద్దుటూరు ఆర్.డి., పులివెందుల సబ్ ఆర్.డి.,పులివెందుల మున్సిపాల్టికి చేరిన పులివెందుల గ్రామ పొలంలో సర్వేనెం.సం.ఖుష్కీ 455 నెంబరు పైకి వేయబడిన ప్లాట్ల పైకి ప్లాట్ నెం. 30 & 31 నందు 190 చదరపు గజముల జాగాకు **హద్దులు,కొలతలు** : **తూర్పు** : ప్లాట్ నెం. 29 జాగా. **పడమర** : ప్లాట్ నెం. 32 జాగా. **ఉత్తరం** : 3 అడుగుల వెడల్పు గల రొడ్డి రస్తా. **దక్షిణం** : 15 అడుగులు వెడల్పు గల రస్తా. ఈ మధ్య **తూర్పు-పడమరం** : 30 అడుగుల లేక 9.144 మీటర్లు **ఉత్తరం- దక్షిణం** : 57 అడుగులు లేక 17.373 మీటర్లు కొలతలు గల 190 చదరపు గజములు జాగా పూరా.

Sd- **Gajjala Ramalinga Reddy,** ADVOCATE
Aravinda Nagar, Kadapa District. (AP/227/1977)